

నేడు బీసీ బంద్

అన్ని కుల, రాజకీయ పార్టీల మద్దతు

- సంఘీభావం ప్రకటించిన 'ట్రస్మా'
- సన్నాహక సమావేశాలతో మద్దతు కూడగడుతున్న బీసీ జేఏసీ



కరీంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జిల్లా బంద్‌కు బీసీ జేఏసీ సన్నాహక సమావేశాలతో అన్నివర్గాల మద్దతను కూడగట్టింది. 'బంద్ ఫర్ జస్టిస్' నినాదంతో జనాభా దామాషా ప్రకారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ ఐక్యవేదిక ఇచ్చిన శనివారం రాష్ట్ర వ్యాప్తబంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వామపక్ష పార్టీలు, టీజేఎస్, జాగృతితో పాటు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా), ప్రైవేట్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కూడా బంద్‌కు సంఘీభావం ప్రకటించాయి. అలాగే బీసీల ఐక్యతను చాటే విధంగా అన్నికుల సంఘాలు సమావేశాలను ఏర్పాటు చేసుకొని బీసీ బందుకు మద్దతునిస్తూ తీర్మానించాయి. జిల్లా బీసీ సంఘాల జేఏసీ నాయకులు రాజకీయ పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థల అధినేతలను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ జేఏసీ డిమాండ్ చేస్తోంది. 42శాతం బీసీ రిజర్వేషన్‌పై కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బీసీ జేఏసీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి శనివారం రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. బీసీ బంద్‌కు బీజేపీ మద్దతు ప్రకటిస్తూ కాంగ్రెస్ పార్టీకి 42శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో చిత్తశుద్ధి లేదని ఆరోపిస్తూ సంఘీభావంగా బంద్‌లో పాల్గొనాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ పార్టీ కూడా జీవో 9 కోర్టులో నిలువదని, 42శాతం రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని, పార్లమెంట్‌లో చట్టం తెచ్చేందుకు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీశ్రేణులు బంద్‌లో

(మిగతా 8వ పేజీలో)

42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు జరపాలి

- బీసీ సంఘాల ఐక్య వేదిక దండోరా



బీసీ బందును విజయవంతం చేయాలని టవర్ సర్కిల్ వద్ద డప్పు చాటింపు వేస్తున్న బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు

గణేశ్‌నగర్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కరీంనగర్ జిల్లా బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం టవర్‌సర్కిల్ ప్రాంతంలో శనివారం నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల ఐక్య వేదిక దండోరా చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ వ్యాపార సంస్థలు స్పందించి బంద్‌కు సహకరిస్తామని తెలిపారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ అన్ని బీసీ సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి నిరసన తెలుపుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లేని పక్షంలో బీసీల ప్రతిఘటన ఎదుర్కొనక తప్పదన్నారు. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతి నేతలు హైకోర్టులో కేసు వేసి స్టే తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ 18న రాష్ట్ర వ్యాప్త బంద్‌కి పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు ఎన్నం ప్రకాష్, అది మల్లేశం, కేశిపెడ్డి శ్రీధర్ రాజు, నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, రంగు సంపత్ గౌడ్, దొగ్గలి శ్రీధర్, మంతెన కిరణ్, శనగొండ వాసు, మదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి, సిరిశెట్టి రాజేష్, గాలి రవి యాదవ్, పురుషోత్తం ఆశిష్ గౌడ్, పెంట శ్రీనివాస్, నితిన్, గంగిపెల్లి అరుణ,కొత్తకొండజ్యోతి,దేవరకొండ సంతోషి, తిరుమలపాల్గొన్నారు.

వేడుకలు ప్రారంభం

- రేపు ధన్‌తేరాస్
- బంగారం కొనుగోళ్లు.. లక్ష్మీపూజలతో సందడి



కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల ప్రారంభ రోజు ధన్‌తేరాస్ (ధన త్రయోదశి) ఆదివారం జరుపుకోనున్నారు. బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీ కావడంతో విక్రయ కేంద్రాలు, రెడీమేడ్ జువెల్లరీ షాపుల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. బంగారం, వెండి పిసరంతైనా కొనుగోలు చేయడంతో పాటు పాత నగదు బిళ్లలకు కొత్త నగదును కల్పి అమావాస్య వరకు అభిషేకాలు చేస్తారు. త్రయోదశి నుంచి లక్ష్మీదేవి, కుబేరునికి అభిషేక అర్చనలు జరుపుతారు. గృహ, వస్త్ర, వ్యాపార, వాణిజ్య నిలయాలను, కార్యాలయాలను శుద్ధి చేసి రంగులు వేస్తారు. మామిడి తోరణాలు, పసుపు, కుంకుములు, పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. పూజా మందిరాలు, దేవుని పటాలకు అలంకారాలు చేస్తారు. ప్రతి ఇల్లు, వ్యాపార నిలయం అలంకరణలతో, దీపకాంతుల మధ్య కళకళ లాడుతుంది. శనివారం వరకే అన్ని ఏర్పాట్లు చేసుకోనుండగా ఆదివారం ధన్‌తేరాస్, సోమవారం నరక చతుర్దశి- మంగళహారతులు, సాయంత్రం దీపావళి వేడుకలు, ధనలక్ష్మీ పూజలు, మంగళవారం కేదారీశ్వర వ్రతాలు వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. దీపావళి రోజు స్వాతీ నక్షత్రం లేనందున కొత్త నోములు లేవు. ధన్‌తేరాస్ సందర్భంగా విక్రయ కేంద్రాలు కొనుగోళ్లతో సందడిగా మారాయి.

- సామాన్యులకు భారంగా ధరలు



ఇటీవల బంగారం రేట్లు ఒక్కసారిగా పెరిగిపోయి వినియోగదారులకు చుక్కలను చూపుతున్నాయి. శుక్రవారం బంగారం తులం 1,58,050 రూపాయలకు అందు బాటులో ఉండగా 10 గ్రాములకు 1,35,500 రూపాయలు పలికింది. వెండి తులంకు 2,193 రూపాయలు కాగా 10 గ్రాములకు 1,880 రూపాయలు పలికింది. పెరిగిన ధరలతో సామాన్యుడు పసిడి కొనే పరిస్థితి లేదు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు

- సీపీ గౌస్ ఆలం
- రామకృష్ణ కాలనీలో కార్డన్ సెర్చ్
- 117 బైక్‌లు, 7 ఆటోలు స్వాధీనం

తిమ్మాపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ గౌస్ ఆలం హెచ్చరించారు. మండలంలోని



రామకృష్ణ కాలనీలో నిర్వహించిన కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

రామకృష్ణా కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 124 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వీటిలో 117 ద్విచక్ర వాహనాలు, 7 ఆటోలు ఉన్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై, మాదక ద్రవ్యాలు వాడకం వాటి దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరం జరిగితే గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా సొమ్మును తిరిగి పొందవచ్చు అని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. షీటీం, టీ సేఫ్ యాప్ గురించి అవగాహన కల్పించారు. కాలనీ భద్రత కోసం నేను సైతం అంటూ, గ్రామ పెద్దలు 55 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారని సీపీ తెలిపారు. ప్రజలు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని సీపీ గౌస్ ఆలం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్‌పెక్టర్లు సదన్ కుమార్, బిల్లా కోటేశ్వర్, ప్రదీప్, శ్రీలత, పుల్లయ్య, సరిలాల్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

301 వాహనాలపై ట్రాఫిక్ పెండింగ్ చలాన్‌లు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా 301 మంది వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డారని పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి వాహనాలపై జరిమానాలు 64,39,715 రూపాయలుందని సీపీ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా అక్టోబర్ 17వ తేదీ నాటికి, మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలకు అధిక సార్లు పాల్పడి, జరిమానాలు విధించబడి తప్పించుకు తిరుగుతున్న 301 మందిని గుర్తించినట్లు పోలీసు కమిషనర్ తెలిపారు. వీరిలో 100, అంతకంటే ఎక్కువగా పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు 60గా గుర్తించగా వాటి జరిమానా మొత్తం 21 లక్షల 83 వేల 875 రూపాయలుందన్నారు. 50 నుంచి 100 వరకు పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు 241 వాహనాలు ఉన్నట్లుగా గుర్తించామని, వీటి జరిమానా మొత్తం42,55,840 రూపాయలుందన్నారు. వీరందరూ ఒక్కొక్కరు తమ వాహనాలపై 50, అంతకంటే ఎక్కువ పెండింగ్ చలాన్లను కలిగి ఉండడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. పెండింగ్ చలాన్లు వసూలు చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాలని సీపీ ఆదేశించారు. పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాలు పట్టుబడితే స్వాధీనం చేసుకోవడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

- పిల్లల్లో పోషణ లోప నివారణకు చర్యలు
- శుక్రవారం సభలో కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలలో జరిగిన శుక్రవారం సభకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మాట్లాడారు. మహిళ సంక్షేమం, ఆరోగ్యంపై జిల్లా కలెక్టర్ ఆలోచించి శుక్రవారం సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పిల్లల్లో పోషణ లోప నివారణకు ఐసీడీఎస్ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం సభలో ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్య కేంద్ర, అంగన్‌వాడీకేంద్రాల సేవలను పర్యవేక్షిస్తామని తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో రక్తహీనతను గుర్తించి వారికి ఐరెన్ మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 45 రకాల ఉచిత వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, సీడీపీవో నర్సింగరాణి, ఎంపీడీవో రాము, ఎంపీవో గౌరీ రమేష్, ఎంఈవో ప్రభాకర్‌రావు, సూపర్‌వైజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

- చిన్ననాటి స్మృతులను నెమరు వేసుకున్న ఎమ్మెల్యే

పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు సంప్రదాయ ఆటలు ఆడించారు. చిర్ర గోనె, తొక్కుడు బిల్ల వంటి ఆటలు ఆడుతుండగా చిన్ననాట గ్రామాల్లో ఆడిన జ్ఞాపకాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నెమరు వేసుకున్నారు. వెంటనే తానుకూడా గోనె పట్టి చిర్రను కొట్టారు. గ్రామీణ ఆటలు చిర్ర గోనె, గోళీలు, దాగుడు మూతలు, తొక్కుడు బిల్ల వంటి ఆటలు ఆడుతారా, ఈ ఆటలు మీకు ఇష్టమేనా అంటూ విద్యార్థులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం అభిప్రాయ సేకరణ



కరీంనగర్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న 36 మందిలో 30 మందితో పాటు కొందరు ముఖ్య నాయకులతో ఏఐసీసీ పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్యే శ్రీనివాస్‌మానే వ్యక్తిగతంగా ఒక్కొక్కరితో మాట్లాడారు. కరీంనగర్ శ్వేత హోటల్‌లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వన్‌టూవన్ కొనసాగింది. శ్రీనివాస్ మానే ఒక్కరే తన గదిలోకి ఒక్కొక్కరిని పిలుచుకుని దరఖాస్తు దారుడి వ్యక్తిగత సమాచారంతో పాటు నీకే అధ్యక్ష పదవి ఎందుకు ఇవ్వాలి? కుల సమీకరణలు, ప్రొఫైల్, సదరు నాయకులు ఇంత వరకు చేపట్టిన పదవులు, ఇతర సమాచారాన్ని సేకరించి నోట్ చేసుకున్నారు. ఏఐసీసీ పరిశీలకులు శ్రీనివాస్‌మానేతో ఒంటరిగా భేటీ అయినవారిలో సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, టీపీసీసీ కార్యదర్శి రుద్ర సంతోష్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ తదితరులున్నారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం 5 రోజుల నుంచి ఏఐసీసీ పరిశీలకులు శ్రీనివాస్ మానెతోపాటు టీపీసీసీ పరిశీలకులు ఆత్రం సుగుణ, చిట్ల సత్యనారాయణలు ఉమ్మడి జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తూ అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. శుక్రవారం కరీంనగర్, మానకొండూర్, హుజురాబాద్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

- ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ ద్వారా ప్రాణాపాయస్థితి నుంచి వ్యక్తిని కాపాడవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి హఠాత్తుగా కుప్పకూలినపుడు, ప్రాణాపాయ స్థితి నుండి రక్షించడానికి కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) చేయాల్సిన పద్ధతి గురించి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఉద్యోగులకు సీపీఆర్ టెక్నిక్స్ నేర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎవరైనా గుండె ఆగిపోయి పడిపోయినపుడు సీపీఆర్ ద్వారా రక్త ప్రసరణను తిరిగి అవయవాలకు పంపించి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రజల జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాలని, శారీరక వ్యాయామం లాంటివి అలవాటు చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని, యోగా వ్యాయమం చాలా ముఖ్యమన్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఉద్యోగుల కోసం త్వరలో ఒక వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మోహియుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్‌కుమార్, వైద్య, టౌన్ ప్లానింగ్, సానిటేషన్, రెవెన్యూ,ఇంజనీరింగ్ అధికారులు,ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

94 వైన్‌షాపులకు 1,034 దరఖాస్తులు

- శుక్రవారం ఒక్కరోజే 615 దరఖాస్తులు



కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 94 వైన్‌షాపుల లైసెన్స్‌ల కోసం ఎక్సైజ్ శాఖ సెప్టెంబరు 26న నోటిఫికేషన్‌ను జారీ చేయగా ఇప్పటి వరకు 1,034 దరఖాస్తులు అందాయి. శుక్రవారం ఒక్క రోజే 615 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 21 వైన్‌షాపులకు 164 దరఖాస్తులు, కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 26 వైన్‌షాపులకు 179 దరఖాస్తులు, తిమ్మాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 14 వైన్‌షాపులకు 125 దరఖాస్తులు, హుజూరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 17 వైన్‌షాపులకు 85 దరఖాస్తులు, జమ్మికుంట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని 16 వైన్‌షాపులకు 62 దరఖాస్తులు అందాయని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 18 (శనివారం) చివరి గడువు ఉంది. 2023లో నిర్వహించి మద్యం టెండర్లలో 94 వైన్‌షాపులకు 4,040 దరఖాస్తులు రాగా ఈ దఫా ఒక్కరోజే గడువు ఉండగ అప్పటి వరకు 4వ వంతు దరఖాస్తులే రావటంతో ఎక్సైజ్ అధికారులు టెన్షన్‌కు గురవుతున్నారు. కరీంనగర్‌లోని బడా మద్యం వ్యాపారులు, దశాబ్దాల నుంచి మద్యం వ్యాపారంలో ఉన్న వారు శనివారం పెద్ద ఎత్తున దరఖాస్తులు వేస్తారని ఎక్సైజ్ అధికారులు ఆశతో ఉన్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ

● యువకుడి మృతి

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టగా ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం శాంతాపూర్‌కు చెందిన బెక్కం సతీష్(35) అనేవ్యక్తి తన ద్విచక్ర వాహనంపై లక్షెట్టిపేట వైపు వెళ్లుతున్నాడు. అదే సమయంలో ఏపీ 25హెచ్ 2255 నంబరు గల కారు ఎదురుగా వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. ఈ సంఘటనలో సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికురాలి మృతి

కరీంనగర్ క్రైం/టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జ్యోతినగర్ పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్ నగర్‌కు చెందిన మున్సిపల్ స్వీపర్ బడుగు రేణుక(57) విధినిర్వహణలో ఉండగా ఉదయం 10గంటల ప్రాంతంలో జ్యోతినగర్ పెట్రోల్ బంక్ నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వేగంగా ఆమెను ఢీకొట్టాడు. దీంతో రేణుక తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన రేణుకను ఆసుపత్రికి తరలించగా 11:40గంటలకు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ సహాయం కింద 20వేల రూపాయల నగదు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో సుమన్, శానిటరీ సూపర్‌వైజర్లు శ్యామ్‌రాజ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య


జ్యోతి (ఫైల్)

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదువుతున్న ఓ యువతి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికిచెందిన బోయిన జ్యోతి(21) డిగ్రీ సెకండియర్ చదువుతోంది. గురువారం రాత్రి జ్యోతి పురుగుల మందుతాగింది. తల్లిదండ్రులు గుర్తించివెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం పదిగంటలకు చికిత్సపొందుతూ మృతిచెందింది. తన కూతురు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడానికి మృతురాలి స్నేహితుడి ప్రేమ వేధింపులే కారణమంటూ తల్లి బోయిని రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణం మృతురాలి కాలేజీ స్నేహితుడా లేక గ్రామానికి చెందిన స్నేహితుడా అనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


జంగరాజు (ఫైల్)

రామగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన జంగరాజు(38) అనే యువకుడు బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజును హుటాహుటిన వరంగల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య జంగ స్రవంతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్ అందజేత


బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 4సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వాటిని యజమానులకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన కాత రాజకుమార్ ఆరునెలల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రికవరీ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బాధితుడు రాజకుమార్‌కు అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే సీఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

కారుణ్యంపై కనికరమేది?



● ఉపాధి లేక రోడ్డున పడుతున్న కుటుంబాలు
● ప్రభుత్వ కాలయాపనతో ఆందోళన
● ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి

వేములవాడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి మరణించినా, మెడికల్ అన్‌ఫిట్ అయిన సందర్భంలో ఇచ్చే కారుణ్య నియా మకాలపై ఎన్నో కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటంబానికి జీవనాధారం కల్పించేందుకు ఆ కుటంబంలో అర్హత గలిగిన ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. కారుణ్య నియామకాలపై కాలయాపన జరుగుతుండటంతో ఉద్యోగి కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

నియామకాలకు ఎవరు అర్హులు :

ప్రభుత్వ ఉద్యోగులు మరణించినా లేక ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండేందుకు కుటుంబంలో అర్హత గల ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి వారసులు, వైద్య కారణాలతో రిటైర్‌మెంట్ తీసుకున్న ఉద్యోగి వారసులు, ఏడేళ్ల పాటు కనిపించకుండా పోయిన ఉద్యోగి వారసులు కారుణ్య నియామకానికి అర్హులు.

కారుణ్య నియామకాల విధి విధానాలు

కారుణ్య నియామకాలు ఎవరికిస్తారన్న అనుమానాలు చాలా మందికి ఉంటాయి. దానికి విధివిధానాలు ఉన్నాయి. ఉద్యోగి భార్య లేదా భర్త, లేదా కుమారుడు, కుమార్తెలు ఉద్యోగానికి అర్హులు అవుతారు. ఉద్యోగి మరణించిన నాటికి 5 సంవత్సరాల ముందు చట్టబద్ధంగా దత్తత తీసుకున్న కుమారుడు లేదా కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి భార్య, భర్త నియామకానికి ఇష్టపడిన సందర్భంలో ఆ కుటుంబంపై ఆధారపడిన వివాహిత కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి అవివాహితుడై మరణించినట్లయితే అతని సోదరుడు, సోదరికి కారుణ్య నియామకం కల్పించవచ్చు.

ఏ పోస్టుల్లో నియమిస్తారు :

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో గానీ అంతకన్న తుక్కువ గానీ కారుణ్య నియామకాలను ఇవ్వవచ్చు. ఆ పోస్టుకు స్కేల్‌కు మించని పోస్టులో గానీ అంతకన్న తక్కువ పోస్టులో గానీ నియమించే వెసులుబాటు ఉంటుంది.

నియామకపు విధానం :

ఉద్యోగి మరణించిన ఏడాదిలోపు అతని కుటుంబ సభ్యులు నియామకం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఆయా పోస్టులకు సంబంధించిన సరైన అర్హత కలిగి ఉండాలి. జూనియర్ అసిస్టెంట్ ఐతే తప్పనిసరిగా ఇంటర్మీడియట్ చేసి ఉండాలనే నిబంధన ఉంటుంది. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి పనిచేసిన యూనిట్‌లో నియామకం చేస్తారు. కలెక్టర్ ఇతర డిపార్టుమెంట్‌లకు కేటాయించవచ్చు. ఖాళీలు లేని సందర్భంలో కలెక్టర్ ఒక క్యాలెండర్ సంవత్సరంలో 5 వరకు సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించే అధికారం కలెక్టర్‌కు ఉటుంది.

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబాలకు రూ. 40 వేలు, నాన్ గెజిటెడ్ వారికి రూ. 60 వేలు గెజిటెడ్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.80 వేలు ఎక్స్‌గ్రేషియా చెల్లించవచ్చును.

ప్రభుత్వం కారుణ్య నియామకాలపై దృష్టిసారించాలి

బూర సదానందం, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్..



ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా, కారణాలతో మృతి చెందిన వారు, అనారోగ్యంతో ఉద్యోగానికి దూరమైన వారి కుటుంబ సభ్యులకు జీవో ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి. ఉపాధ్యాయుల సమస్యలపైన ప్రభుత్వం దృష్టిసారించాలి. ఉపాధ్యాయులను కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి..

దిక్కుతోచని స్థితితో కుటుంబాలు

వంగ తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మరణించిన వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఉద్యోగాలు కల్పిస్తే మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునే అవకాశం కల్పించినట్లు ఉంటుంది.

నాన్న మృతి చెంది సంవత్సరం దాటింది..

పూరేల్లి కల్పన, మరణించిన ప్రభుత్వ ఉద్యోగి కూతురు



మా నాన్న పూరేల్లి రవీందర్ వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో హెచ్ఎంగా పనిచేశారు. మా నాన్న అకాలమరణం చెంది సంవత్సరం దాటుతుంది. కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఉద్యోగం ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎంబీఏ పూర్తి చేసి ఉన్నాను.

ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడి

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. గురువారం సాయంత్రం గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ దొరికిన వారిని కాళ్లు, చేతులు, ఇంటి ఆవరణలో కూర్చున్న వారి వీపులపై తీవ్రంగా కరిచింది. రక్తస్రావమైన బాధితులు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. అయితే ఒకే కుటుంబంలో తల్లీ ఇద్దరు కూతుళ్లు వాకిట్లో కూర్చోగా వారిపై విరుచుకుపడింది. కుక్క బారినుంచి తప్పించుకునేందుకు తల్లీ కూతుళ్లు ప్రయత్నించినా తల్లిని వీపుపై కూతుళ్లను కాళ్లు, చేతులపై కరిచింది. పిచ్చికుక్క బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటి ప్రహరీని ఢీకొట్టిన కంటైనర్

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్షకుర్తిలో కంటైనర్ అదుపు తప్పి ఇంటి ప్రహరీతోపాటు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడగా అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి భారీ కంటైనర్ విజయవాడ వెళ్తోంది. డ్రైవర్ మద్యం మత్తులో దారి తప్పి గర్షకుర్తి మీదుగా వాహనాన్ని మళ్లించాడు. గర్షకుర్తిలో రోడ్డు పక్కన ప్రహరీ, ఆ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో గోడకూలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరాను నిలిపివేశారు. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసూరి శంకరయ్య(58) కొంతకాలంగా అప్పులతో ఆర్థికంగా బాధపడుతున్నాడు. ఈనెల 16న పనికి వెల్లుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రెండు రోజులైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అదృశ్యం అయినట్లు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మంథని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వ్యాపారాల పేరుతో పెట్టుబడి పేరిట పలువురి వద్ద భారీగా అప్పులు తీసుకొని మోసాలకు పాల్పడిన బంధం చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు మంథనికి చెందిన బండారి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి గోదావరిఖని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చంద్రశేఖర్ మంథని చెందిన దాదాపు 25 మంది వద్ద వ్యాపార పెట్టుబడిల పేరిట వడ్డీ ఎక్కువగా ఇస్తానని నమ్మించి దాదాపు 5-6కోట్లు వసూలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. మరికొందరు బాధితులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.6800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6800 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 159మంది రైతులు 1238 క్వింటాళ్ల విడిపత్తి, 31మంది రైతులు 43క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికితీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.6800, కనిష్ఠధర రూ.4800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోతెవాగు పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వన్నారం, మోతె నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి వివిధ గ్రామాలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ కె రాజు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మల్లాపూర్ : మండలంలోని చిట్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని మల్లాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలోని గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వచేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గోదావరినది పరివాహక గ్రామాలతో పాటువాగుల నుంచి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా ఇసుకను తరలించినా , నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడికి యత్నం

● వివిధ మండలాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు ● అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత


పగిలిన ఫాం హౌస్ కిటికీ అద్దాలు

బెజ్జంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చెందిన ఫాంహౌస్‌పై కాంగ్రెస్‌కార్యకర్తలు శుక్రవారం దాడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత నెలకొంది. పలువురు కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు ఒకరిపై మరొకరు విమర్శలు, దూషణలు చేసుకున్న ఓఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రసమయి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం అన్నిమండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని గుండారం గ్రామంలోని రసమయి బాలకిషన్‌కుచెందిన ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు నియోజకవర్గంలోని బెజ్జంకి, ఇల్లంతకుంట, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌నాయకులు వివిధమార్గాల్లో వచ్చారు. విషయం తెలిసుకున్న పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కొందరు ఫాంహౌస్‌పైకి రాళ్లు విసిరారు. దీంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈక్రమంలో పోలీసులు పలువురి అదుపులోకి తీసుకుని బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. కాంగ్రెస్‌నాయకులు రసమయికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే సత్యనారాయణకు.. రసమయి బాలకిషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఎమ్మెల్యే సత్యనారాయణ చేరుకొని వారితో మాట్లాడి మాజీఎమ్మెల్యే రసమయిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు స్థానిక ఎడ్లబండి చౌరస్తాలో రసమయి బాలకిషన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమరవాణా, లైంగిక వేధింపులు, పిల్లలతో భిక్షాటన, కూలీ పనులు చేయించడం, అవయవ దోపిడీ, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన టాస్క్‌ఫోర్ ఎస్సై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ మానవ అక్రమరవాణా నియంత్రణ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌చార్జి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఐటీ టవర్ సమీపంలోని టీజీ ఎంప్లాయిబిలిటీ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో విద్యార్థులకు పైఅంశాలపై వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

నిప్పంటుకొని వంట సామగ్రి, దుస్తులు దగ్ధం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎం శాంత అనే మహిళ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. శాంత ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని సామన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఇంటితాళం పగుల గొట్టి మంటలార్పారు. రామగుండం రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రూ.10వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

రైస్‌మిల్లులో ఇసుక అక్రమ నిల్వ

● గుట్టుగా సాగుతున్న దందా
● పట్టుకున్న సిబ్బందిని నెట్టేసి టిప్పర్లతో సహా పరార్


కోరుట్లలో పట్టుబడ్డ ఇసుక లారీ

కథలాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో కోరుట్లకు వెళ్లేదారిలో ఉన్న రైస్‌మిల్‌లో వడ్లను నిల్వచేయడానికి బదులు ఇసుక డిపోగా మార్చేశారు. కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నట్టు రెవెన్యూ అధికారులు పక్కాసమాచారం అందుకుని గురువారం రాత్రి అకస్మికంగా దాడులు చేశారు. ఆ సమయంలో రెండు టిప్పర్లలో ఇసుకను నింపుతుండగా సిబ్బంది పనులను నిలిపివేశారు. ఒక్కసారిగా డ్రైవర్లు సిబ్బందిని నెట్టేసి టిప్పర్లను స్టార్ట్ చేసుకుని కోరుట్ల వైపు పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడ పట్టుకుని ఆర్టీసీడిపో శివారులో నిలిపి వేశారని తెలిసింది. రైస్‌మిల్ యజమాని తక్కళ్లపల్లి శివారులో ఉన్న పెద్దవాగు నుంచి ట్రాక్టర్లతో ప్రతీనిత్యం రైస్‌మిల్లుకు ఇసుకను తరలించి నిల్వ చేస్తున్నాడు. భారీ డంపులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో టిప్పర్లలో ఆర్మూర్, నిర్మల్ వంటి ప్రాంతాలకు తరలించి అక్రమదారుల్లో సొమ్ము చేసుకుంటున్నాడని అధికారులకు సమాచారం అందింది. ఈక్రమంలో దాడులు చేసి అక్రమ వ్యవహారాన్ని రెవెన్యూ అధికారులు రట్టు చేశారు. కాగా గురువారం రాత్రి నిల్వఉన్న ఇసుకను ట్రాక్టర్ల సహాయంతో మరో చోటుకు రైస్‌మిల్ యజమాని తరలించినట్టు తెలుస్తోంది.

మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం గాలింపు

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్‌తో పాటు జిల్లాలో పలుప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపడుతున్నట్లు డీఎస్పీరఘుచందర్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. బంగారం, నగదు ఇంట్లో ఉంచుకోరాదని బ్యాంకుల్లో పెట్టాలని ప్రజలకు డీఎస్పీ రఘుచందర్ సూచించారు. వేరే గ్రామాలకు తీర్థయాత్రలకు వెళ్లినపుడు పొరుగింటి వాళ్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని డీఎస్పీ చెప్పారు. దొంగతనాలను అరికట్టడానికి గస్తీ ముమ్మరం చేశామన్నారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన టేకు కలప పట్టివేత


పట్టుకున్న టేకు కలప దుంగలు

రుద్రంగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన టేకు కలపను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. పోలీసులు పట్టుకున్న టేకు కలపను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రాఘవేంద్రరావు కథనంప్రకారం.. రుద్రంగి మండల కేంద్రంలోని గంగారెడ్డి ఇంట్లో అక్రమంగా టేకుకలపను నిల్వచేసి నట్లు విశ్వసనీయ సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 35టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న టేకు కలపను కొలతలు చేపట్టి కలప విలువ ప్రకటిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డ వాహనం

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్‌రహదారిపై అక్రమంగా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సివిల్‌సప్లై అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం గుండ్లపల్లి రాజీవ్ రహదారి వద్ద సివిల్ సప్లయి అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న బొజ్జ రాజును, పికప్ వాహనాన్ని పట్టుకున్న సివిల్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సివిల్‌సప్లై అధికారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు చోరీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోగల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డైనింగ్‌హాల్ ముందు ఉన్న ఆరు సీలింగ్‌ఫ్యాన్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేశారు. తొమ్మిదవ తరగతిగది ముందు స్టార్ గుర్తువేసి కోడిగుడ్డు, నిమ్మకాయలు, పసుపు, మిర్చి, కుంకుమ, బొగ్గుతో క్షుద్ర పూజలు జరిపారు. ఫిర్యాదు అందుకున్న పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాఠశాల వద్ద పహారాకోసం ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డైనింగ్‌హాల్‌లో కనిపించని సీలింగ్ ఫ్యాన్లు

కారును ఢీ కొట్టిన ఆటో: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి వీరయ్య కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణబ్యాంకులో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి ఆటోలో వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న కారును ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న వీరయ్యకు ఎడమ పక్కన భుజానికి తీవ్ర గాయం కాగా, కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని వీరయ్యను 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



సైదాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బొడిగె లహరి ఎస్ జీఎఫ్ అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, ఉపా ధ్యాయుడు హన్మండ్ల భాస్కర్ తెలిపారు. విద్యార్థిని ఈనెల 18నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలపూర్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. లహరిని హన్మండ్ల భాస్కర్ అభినందించారు.

తాటిపల్లి గురుకుల విద్యార్థిని..



మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం దర్శిని రాష్ట్రస్థాయి పాఠశాలల వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో జరిగిన అండర్-17 విభాగం పోటీలలో ఎం దర్శిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినిని ఎంఈవో జయసింహరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..







సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కే అక్షిత్, కే సాయిచరణ్ సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్- 19 వాలీబాల్ పోటీలకు అక్షిత్, సాయిచరణ్ ఎంపిక య్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కనక విజయ రఘునందన్, కళాశాల క్రీడల ప్రతినిధి కనకయ్య, అధ్యాపకులు, సిబ్బంది అక్షిత్, సాయి చరణ్‌ను అభినందించారు.

● **కోనరావుపేట:** కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడి యట్ చదువుతున్న విద్యార్థి సాల్వల క్రాంతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైన ట్లు ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని క్రాంతిని అధ్యాపక బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో వెల్గటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నందయ్య, పీడీ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలో భాగంగా ఈ నెల 16న మల్యాలలోని ఎస్ఎస్‌వీ ఆల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెల్గటూరు విద్యార్థులు గజ్జెల శ్రీవిద్య, బోరె జాశ్విత్, బట్టు గ్రీష్మ టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచి ఈనెల 22న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నందయ్యపీడీ రాజ్‌కుమార్, టేబుల్ టెన్నిస్ ఆర్గనైజేషన్ కన్వీనర్ రాజమల్లయ్య, అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మలత, కొండాల్ రెడ్డి పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రోత్సాహం కోసం తప్పని ఎదురుచూపులు



● కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నిరాశ
● సకాలంలో విడుదల కాని నిధులు
● జగిత్యాల జిల్లాలో 205 జంటల నిరీక్షణ

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలు చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహక సొమ్ము కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. కులాంతర వివాహాలు చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామన్న ప్రభుత్వం ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదు. షెడ్యూల్ కులానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఇది వరకు రూ.50 వేలు ఉన్న ఆర్థికసాయాన్ని గత ప్రభుత్వం 2019 నవంబరులో రూ.2.50 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

కానీ ఆదర్శ దంపతులకు సంబంధించిన ప్రోత్సాహకాలకు నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడంలేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సాయం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఆదర్శ వివాహాలు చేసుకున్న 253 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో 68 జంటలకే ప్రభుత్వ సాయం అందింది. ఇంకా 205 జంటల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిధులు రాగానే అందజేస్తాం

రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జగిత్యాల



ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అర్హులైన జంటలకు అందించి జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నాం.



అర్హులు వీరే..

కులాంతర వివాహం చేసుకున్నవారు ఆర్థిక సాయం పొందాలంటే పలు అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పకుండా షెడ్యూల్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్లు కచ్చితంగా నిండి ఉండాలి. వివాహం చట్ట ప్రకారం రిజిష్టర్ అయి ఉండాలి. పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలి. మొదటి వివాహానికి మాత్రమే ఈ ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాది లోపు జిల్లా షెడ్యూ ల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుంది. కాగా జగిత్యాల జిల్లాలో కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులు ప్రభుత్వ సాయం కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా, నిధులు తక్కువగా విడుదల చేయడం వల్ల అర్హులందరికీ అందడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 లక్షలు ఇస్తుండడంతో కులాంతర వివాహం చేసుకున్న కొంత మంది జంటలు కల్యాణలక్ష్మి వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయాలని కులాంతర వివాహాలు చేసుకున్న పలువురు దంపతులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలకు 16 పీజీ సీట్ల మంజూరు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో 16పీజీ సీట్లను మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసినట్లు సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్-4, ఎంఎస్ అబ్స్ట్రిక్ గైనకాలజిస్ట్-4, ఎంఎస్ ఆర్థోపెడిక్-4, ఎండీ బయో కెమిస్ట్రీ-4 మొత్తం 16 సీట్లను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఏడాది క్రితం సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లు మంజూరు చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ప్రిన్సిపాల్ హిమబిందు దరఖాస్తు చేశారు. ఎంబీబీఎస్ 4 సంవత్సరంలో అడుగుపెడుతున్న సిమ్స్ మెడికల్ కళాశాలలో అన్నీ వసతులు ఉండడంతో పీజీ విద్యార్థులకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండడంతో 16సీట్లను మంజూరు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ ఐదు డిపార్ట్ మెంట్లలో 24సీట్ల కోసం దరఖాస్తు చేయగా జనరల్ సర్జన్, పిడియాట్రిక్ పీజీ సీట్లను పెండింగ్‌లో పెట్టారని, అవి కూడా త్వరలోనే మంజూరవుతాయని చెప్పారు. త్వరలోనే ఈ పీజీ కోర్సులకు కౌన్సిలింగ్ జరుగుతాయని, పీజీ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్, ఇతర వసతులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్


అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గోల్డెన్ టెంపుల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శ్రీనగర్‌లో పర్యటించి శ్రీనగర్ సమీపంలోని డచ్చిగాం నేషనల్ పార్క్‌ను సందర్శించారు. సాయంత్రం పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం)ను దర్శించుకున్నారు.

మందుబాబుల హంగామా..

సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రోడ్డుపై బైఠాయింపు..


రోడ్డుపై బైఠాయించిన మందు బాబులు

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి మందు బాబులు హంగామా సృష్టించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఇద్దరు మందు బాబులు బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. మద్యం సేవిస్తుండగా పోలీసులు వాహనాన్ని తీసుకుని పోయారని ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సుమారు గంట పాటు హంగామా సృష్టించారు. పోలీసులు చేరుకొని పక్కకు తప్పుకోవాలని సూచించినా వినకపోవడంతో బలవంతంగా పక్కకు లాగి వేశారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు..

విధులకు ఆటంకం కలిగించిన అల్లెపు కనకరాజు, అల్లెపు మల్లిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు సహకరించకుండా దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద

మళ్లీ తెరుచుకున్న ఎస్సారెస్పీ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు శుక్రవారం స్వల్పంగా పెరిగింది. దీంతో వరద గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను తెరిచి 12,500 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శాతవాహన పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో శనివారం నిర్వహించనున్న ఎంఎడ్ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ రెండో సెమిస్టర్, ఎల్‌ఎల్‌ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన ఎంఎడ్, బీఫార్మసీ పరీక్షలు అక్టోబరు 22న ఉంటాయని, ఎల్‌ఎల్‌ఎం పరీక్ష అక్టోబరు 29న ఉంటుందని, మిగిలిన పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులూ లేవని వివరించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్బన్ బ్యాంకు ఎన్నికలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు నవంబరు 1న నిర్వహించనున్నట్లు బ్యాంకు ఎన్నికల అధికారి సీహెచ్. మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బ్రాంచి పరిధిలోని ఓటర్లు నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల బ్రాంచి ఓటర్లు జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు.

21న శాతవాహనలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ కోర్సులో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ తెలిపారు.

ఎంబీఏలో ప్రవేశం పొందని అభ్యర్థులు (ఐసెట్ -2025 అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులు) ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన రుసుముతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్‌లో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని పేర్కొన్నారు. 12సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటి వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

వేగంగా ఆలయ విస్తరణ పనులు..

● ప్రధాన ఆలయంలో తొలగిస్తున్న పైకప్పు రేకులు ● కొనసాగుతున్న భక్తుల దర్శనాలు



రాజన్న ఆలయంలోని పైకప్పు రేకులను తొలగిస్తున్న సిబ్బంది, కోటి లింగాల వైపు ఉన్న క్యూలైన్‌లో దర్శనానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో రూ. 74 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో రాజన్న ఆలయ ఆవరణలోని కళాభవన్, ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్, ఈవో కార్యాలయ భవనాలను కూల్చివేసి చదును చేశారు. కాగా శుక్రవారం రాజన్న ప్రధాన ఆలయంలో భక్తులకు ఎండ తీవ్రతకు, వర్షానికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసిన పైకప్పు రేకుల షెడ్డును సిబ్బంది తొలగిస్తున్నారు.

ఉత్తర ద్వారా నుంచి ఆలయంలోకి వచ్చేందుకు, బయటకు వెళ్లేందుకు, బ్రేక్ దర్శన్ క్యూలైన్‌ల వైపు పనులు జరుగుతుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రధాన తూర్పు ద్వారం పక్కన క్యూలైన్‌లా నుంచి భక్తులను అనుమతిస్తూ, కోటి లింగాల పక్కన క్యూలైన్‌ల ద్వారా అద్దాల మండపం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతినిస్తున్నారు.

భీమన్న ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ..

రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో భక్తులు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి మొగ్గు చూపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భీమేశ్వర ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. భీమన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వందేళ్లు సరిపడేలా రాజన్న ఆలయ నిర్మాణం..

● శృంగేరి పీఠం జగద్గురుకు ఘన స్వాగతం పలకాలి
● వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని వందేళ్లు సరిపడేలా నిర్మాణం చేస్తున్నారని స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 19,20వ తేదీల్లో శృంగేరి పీఠం జగద్గురు విధుశేఖర భారతిస్వామి విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లపై ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిని రూ. 150 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు. వంద ఏళ్ల ఆలయానికి సరి పడేలా ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. రాజన్న ఆలయ అభివృద్ధే ఈప్రాంత ప్రజల, భక్తుల కల అన్నారు.

ఆలయ అభివృద్ధిలో అందరు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈనెల 19, 20వ తేదీన శృంగేరి పీఠం జగద్గురు శ్రీ విధు శేఖర భారతి స్వామి సాయంత్రం 6 గంటలకు వేములవాడ చేరుకుంటారని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, భక్తులు, నాయకులు హాజరవు తున్నారని, అశేష జన సమూహంతో స్వామివారికి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణోత్త ముల కోరిక మేరకు శంకరమఠంలో శ్రీస్వామి వారి అభిషేక కార్యక్రమానికి హాజరువుతారని సూచించారు. పీఠాధిపతి వేములవాడ రాక ముఖ్యమైనదని, 19వ తేదిన సాయంత్రం 6గంటలకు పట్టణంలోని తెలం గాణ చౌక్‌కు అందరూ చేరుకొని స్వాగత కార్య క్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, వైస్‌ఛైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రాజన్న భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు

● రైతులకు ఉచితంగా రాజన్న కోడెల పంపిణీ
● శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):రాజన్నకు కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి ప్రతీక అని స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు శుక్రవారం కోడెలను ఉచితంగా పంపిణీ చేశారు. గోశాలలోని కోడెల పరిస్థితిని పరిశీలించారు. కోడెలకు పచ్చిగడ్డి అందిస్తున్నారా.. లేదా.. ఆరా తీశారు. అనంతరం కోడెలకు పచ్చిగడ్డిని అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు నేరుగా కోడె లను పంపిణీ చేయడంతో వారి వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారన్నారు. రైతులు కోడెలను చక్కగా చూసుకుంటూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.


రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

అర్హులైన రైతులకు 102 జతల జీవాల పంపిణీ

కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు కలిగి ఆన్‌లైన్‌లో దరఖాస్తున్న చేసుకున్న అర్హులైన రైతులకు 102 జతల జీవాలను పంపిణీ చేశామని కలెక్టర్ ఎం. హరిత అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించి రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వాటిని వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసకున్న పత్రాలను పరిశీలించి కోడెలను అందిస్తున్నామన్నారు. కోడెలు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఎమ్మార్వో విజయ ప్రకాశ్‌రావు ఉన్నారు.


రైతుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

రాజన్న సేవలో విప్, కాంగ్రెస్ అబ్జర్వర్


ప్రత్యేక పూజలో పాల్గొన్న విప్ మనె శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ అబ్జర్వర్ వి మనె శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

● న్యూస్‌బాక్స్

భగత్‌నగర్: అక్రమ అరెస్టులు ఉద్యమాలను ఆపలేవని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఛలో రాజ్‌భవన్ నేపథ్యంలో శుక్రవారం ఆయనను ముందుస్తు అరెస్టు చేశారు.

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ గోడౌన్స్ ఎన్‌పీడీసీఎల్ ఆవరణలో 108 జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గన్నేరువరం: మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం రైతు వేదికలో తహసీల్దారు నరేందర్, ఎంపీవో శ్రీనివాస్ పంపిణీ చేశారు.

హుజూరాబాద్: విద్యార్థులు ధైర్యంతో ముందడుగు వేసినట్లయితే గమ్యాన్ని చేరవచ్చని టౌన్‌సీఐ కరుణాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అంజనేయరావు అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే నిర్వహించారు.

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో 77మంది పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్షలు జరిపి ఐడ్రాప్స్ అందజేశారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని 13వ డివిజన్ సీఎం ప్లాంటేషన్ ఆనుకొని ఉన్న వాకింగ్ ట్రాక్‌లో డస్ట్, జిమ్ ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ కమిషనర్‌ను కోరారు.

కరీంనగర్ టౌన్: రిటైర్డు ఉపాధ్యాయుడు కొండయ్య మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రిటైర్డుమెంట్ ఉద్యోగుల సంక్షేమ సంఘం (రేవా) జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి ప్రకటనలో పేర్కొన్నారు. కొండయ్య మహబూబ్‌నగర్ జిల్లా గుండేడు మండలం కొండారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి 2024 సెప్టెంబరులో పదవీ విరమణ పొందారని, 13 నెలలుగా రిటైర్డుమెంట్ బెనిఫిట్స్ రాక అనారోగ్యానికి గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తగట్టు, గద్దపాక, తాడికల్, కేశవపట్నంలో ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. నిర్ణీత గడువులోగా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. మాజీజడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బసవయ్య, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ తిరుపతి పాల్గొన్నారు.

శంకరపట్నం మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం 62మంది లబ్ధిదారులకు రూ.17.46లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ సురేఖ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రియా మిల్క్ మేనేజర్ నరసింహారావు, అల్ఫోర్స్ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రియామిల్క్ మేనే జర్ సీహెచ్ నరసింహారావు కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషికి ఆహార భద్రత ఎంత ముఖ్యమో వివరించడమే ఆహార దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆహారాన్ని వృథా చేయవద్దని, పేదలకు పంచడం ద్వారా కొంత మంది ఆకలి తీర్చవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఫుడ్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ట్రామా కేసుల్లో గోల్డెన్ అవర్ కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ కుమారస్వామి

సుభాష్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ట్రామా కేసుల్లో గోల్డెన్ అవర్ కీలకమని మెడికవర్ ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు వేణుగోపాల్, రాకేష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ట్రామాడే సందర్భంగా బస్టాండ్‌వద్ద ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రామా కేర్ అంటే అన్ని స్పెషాలిటీలు, వైద్యులు, పరికరాలు అందుబాటులో ఉండి చికిత్స అందించడమేనన్నారు. అనంతరం ట్రాఫిక్ సీఐ కుమారస్వామి మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హెచ్‌ఆర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కట్టించడమే కాం గ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సుడా ఛైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మం డలం బహద్దూర్ ఖాన్ పేట్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు గృహ ప్రవేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. లబ్ధి దారు ఆకుల రమ్యరవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కవిత నాయకత్వంలో 'జాగృతి' బలోపేతం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నాయకత్వంలో జిల్లాలో జాగృతిని బలోపేతం చేస్తామని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో 24వ డివిజన్‌కు చెందిన బీసీ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, మహిళలు జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత ఈనెల 25 నుంచి జిల్లాల్లో పర్యటించనున్నారని, ఈనెల 31, నవంబరు 1న కరీంనగర్ జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు.

నేటి నుంచి 24 వరకు వాసన్ ఐ కేర్‌లో చిన్న పిల్లలకు ఉచిత వైద్యం

సుభాష్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వాసన్ ఐ కేర్‌లో ఈనెల 18 నుంచి 24 వరకు ఉచిత వైద్యం అందించనున్నట్లు ఆస్పత్రి నేత్ర వైద్యులు మైథిలి, హరిత తెలిపారు. శుక్రవారం వాసన్ ఐ కేర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీపావళి సందర్భంగా పిల్లలు ఎక్కువగా టపాసులు కాలుస్తుంటారని, కొంతమంది ప్రమాదాలకు గురవుతుంటారని అన్నారు. పిల్లల కళ్లకు గాయం ఏర్పడితే ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. ఆపరేషన్ అవసరమైతే కేవలం మందులు, మత్తు డాక్టర్ ఫీజు మినహా మిగాతవి ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. దీపావళి రోజునా ఆస్పత్రి తెరిచే ఉంటుందన్నారు. సమావేశంలో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో 'క్రియేటివ్ గెలాక్సీ'



ప్రదర్శనలో కలెక్టర్ పమేలా సత్పతి, ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపలి అల్ఫోర్స్ టైనీటాన్స్‌లో నర్సరీ నుంచి రెండో తరగతి విద్యార్థులతో శుక్రవారం క్రియేటివ్ గెలాక్సీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి అల్ఫోర్స్ అధినేత వి.నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను విశ్లేషణా త్మకంగా సమగ్రంగా వివరిస్తే వారిలో సృజనాత్మకత పెరుగుతుం దన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్య మైన విద్యనందించడం జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచి అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అనేక విషయాలను సరళమైన పద్ధతిలో నేర్పించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతిమలో పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్లు

సుభాష్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతిమ వైద్య కళాశాలలో ఆదివారం నుంచి పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు పీడియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ అమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రతిమ హోటల్‌లో గుండె వైద్య నిపుణులు సుమన్ దత్, విద్యాసాగర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ప్రతిమ ఫౌండేషన్, హీలింగ్ లిటిల్ హార్ట్స్ లండన్‌వారి సహకారంతో 8వసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18ఏళ్లలోపు పిల్లలకు ఆపరేషన్ చేయనున్నట్లు చెప్పారు. 16 నుంచి 18 ఏళ్ల వయస్సుగల వారికి ఎమర్జెన్సీని బట్టి ఆపరేషన్లు చేస్తారని వెల్లడించారు. డాక్టర్ దన్నమనేని రమణ వైద్య బృందం ఆపరేషన్లు చేస్తుందన్నారు. చిన్నపిల్లలకు ఆపరేషన్ అవసరమైన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

గ్రేవ్‌యార్డులో మొక్కలు నాటిన సుడా ఛైర్మన్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని ఈ అఫ్జల్ బియాబని మాజీద్, ముస్లిం గ్రేవ్ యార్డ్‌లో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మొక్కలు నాటారు. డ్రిప్ సిస్టంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాదీముద్దీన్ సిద్ధిక్వి, ఖాజా అలీముద్దీన్ నిజమి,సైద్ షా మహమ్మద్ క్వాద్రి, సమద్ నవాబ్,అబ్దుల్ సామీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి సంబరాలు



వింధ్యావాలీలో దీపావళి వేడుకలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలను నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు వేడుకలను ప్రారంభించారు. వైస్ ఛైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ కడారి అనంతరెడ్డి వేడుకలను ప్రారంభించారు. డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శుక్రవారం కాలుష్య రహిత దీపావళి వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి వేడకలను ప్రారంభించారు. అనంతరం దీపావళి పండుగ విషయాలను వివరించారు.

శ్రీ చైతన్యలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



రమేష్‌రెడ్డికి పూల మొక్క అందజేస్తున్న విద్యార్థిని

తిమ్మాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్స్‌లో ఎంబీఏ, ఎంటెక్ కంప్యూటర్స్ సైన్స్, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో చేరిన విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడారు. కళాశాలలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రాంగణ నియామకాల్లో మంచి ఉద్యోగం సాధించవచ్చని, వినూత్న ఆలోచనలతో కొత్తవ్యాపారాలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ పద్మసాయిశ్రీ సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ ఏరోళ్ల రమేష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని పాతమున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ చందు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అవగాహన కల్పించారు.

శంకరపట్నం: కేజీబీవీలో 108 ఈఎంటీ సతీష్‌రెడ్డి సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

పార్కిన్‌సన్ బాధితులకు డీబీఎస్ కొత్త ఆశ

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్కిన్‌సన్ మందులకు స్పందించని దశలో డీబీఎస్ చికిత్స అద్భుత ఫలితాలను ఇస్తుందని హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాజేశ్ అలుగోలు తెలిపారు. శుక్రవారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీబీఎస్ చికిత్స రోగుల జీవన ప్రమాణాలను దీర్ఘకాలం పాటు మెరుగుపరుస్తుందన్నారు. మార్కెటింగ్ మేనేజర్ నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిరసన



హుజూరాబాద్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూరాబాద్/మానకొండూర్/గన్నేరువరం/వీణవంక/సైదాపూర్/చొప్పదండి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వీణవంకలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్లకు వినతి పత్రం అందజేశారు. నాయకులు వసంత్, రాజు, రామచంద్రం, శ్రీనివాస్, రాజ్‌కుమార్, మానకొండూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పొలు, సుమన్, గన్నేరువరంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేపాకబాబు, సురేష్, రాజ్‌కుమార్, వీణవంకలో నాయకులు రవీందర్, రమేష్, సంపత్, చొప్పదండిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ మాదిగ పాల్గొన్నారు.

నిరాహార దీక్ష

జమ్మికుంట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట గాంధీ చౌరస్తాలో లెదర్ పార్క్ సాధన చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరాహార దీక్ష నిర్వహించారు. మాదిగ హక్కుల దండోర జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన లెదర్ పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్, కార్యదర్శి వడ్డెపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రసమయి దిష్టిబొమ్మ దహనం



రసమయి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయులు

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) మానకొండూరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వాట్సప్ వేదికగా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాచౌక్ వద్ద రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు తాజుద్దీన్, శ్రవణ్‌నాయక్, అబ్దుల్ రెహమాన్, లక్ష్మణ్, రమేష్, దన్నసింగ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్/గన్నేరువరం/శంకరపట్నం/తిమ్మాపూర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రాల్లో రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన విరమింపజేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. గన్నేరువరంలో నాయకులు రసమయిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మానకొండూర్ ధర్నాలో మండల పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, డీసీసీ ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, ఏఎంసీ ఛైర్మన్ ఓదెలు, వైస్‌ఛైర్మన్ తిరుమల్‌రెడ్డి, గన్నేరువరంలో నాయకులు అనిల్, కోటి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, శంకరపట్నంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ నాంపల్లి తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మానకొండూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేశాడని నిరసిస్తూ మండల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే సత్యనారాయణ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ధర్నాతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ సంజీవ్ ఆందోళన విరమింపజేసి వారిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ధర్నాలో మాజీజడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, రామంచ గోపాల్‌రెడ్డి, దేవ సతీష్‌రెడ్డి, పారునంది కిషన్, బోడ రాజశేఖర్, దండబోయిన శేఖర్, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికలు కేడీసీసీబీకి కాదు. అర్బన్ బ్యాంకుకే

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీన కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలకు మోగిన నగారా అనే శీర్షికన ప్రచురించిన వార్త కథనంలో కేడీసీసీబీ ఫొటో, లోగో వచ్చింది. కేడీసీసీబీకి ఎలాంటి ఎన్నికలు జరుగడం లేదు. ఈ ఎన్నికలు అర్బన్ బ్యాంకు పాలకవర్గం కోసం నిర్వహిస్తున్నవే.

నేడు బీసీ బంద్

(5వ పేజీ తరువాయి)

పాల్గొనాలని పిలుపునిచ్చింది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేస్తే అన్ని పార్టీలు మద్దతునిచ్చాయని, జీవో 9 విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ద్వంద వైఖరితో వ్యవహ రించి 42శాతం రిజర్వేషన్లు అడ్డుకున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తూ బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సంఘీభావం ప్రకటించాయి. అలాగే మిగిలిన అన్ని పార్టీలు, కుల సంఘాలు, విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు కూడా బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ సహకారాన్ని ఇవ్వడంతో బంద్ విజయవంతమవుతుందని జేఏసీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫేరియా ఫియెస్టా-2

గణేశ్‌నగర్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో శుక్రవారం ఫేరియా ఫియెస్టా -2 పేరిట పర్యావరణహిత స్వదేశీ దీపావళి ఎకో బజార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాతవాహన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఎస్‌ఆర్‌ఆర్ పిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ సేవలు కీలకం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థలో స్పెషల్ బ్రాంచ్ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) కార్యాలయం నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయ కుమార్, మాధవి, యాదగిరిస్వామి, వాసాల సతీష్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

తిమ్మాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ కాలనీలో గల డైట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులకు, నుస్తులాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ చట్టాలపై అవగాహన కల్పించారు. డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య పాల్గొన్నారు.

ఇన్నోవేషన్‌లో సెయింట్‌జార్జ్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రయాస్ ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్‌లో సెయింట్ జార్జ్ (సీబీఎస్‌ఈ) విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం పాఠశాల ఆవర ణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి.ఫాతిమా రెడ్డి ఇన్నోవేషన్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి ధృతిశ్రీ, లక్షయ, గైడ్ టీచర్ మల్లికార్జున్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ భార్గవ్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

అన్నవరం 'అట్లనే' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కవి అన్నవరం దేవేందర్ రాసిన 'అట్లనే' కవితా సంపుటిని శుక్రవారం హైదరాబాద్‌లో అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో జీవగడ్డ పత్రిక మిత్రుల ఆధ్వర్యంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయులు అల్లం నారాయణ, డాక్టర్ కె.శ్రీనివాస్, తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ రజని, రిజిస్ట్రార్ ఎల్వీకె రెడ్డి, ప్రముఖ కవి అందెశ్రీ, సంగిశెట్టి శ్రీనివాస్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, పొన్నం రవిచంద్ర, జ్వలిత, పిట్టల రవీందర్, వైఎస్ శర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్బన్ బ్యాంకు ఎన్నికలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు నవంబరు 1న నిర్వహించనున్నట్లు బ్యాంకు ఎన్నికల అధికారి సీహెచ్.మనోజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బ్రాంచి పరిధిలోని ఓటర్లు నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల బ్రాంచి ఓటర్లు జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలని వివరించారు.

రేణుక కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు రేణుక కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలనిమాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక 56వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న బడుగు రేణుక శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

బీసీ బంద్‌కు మద్దతుగా మోటార్ సైకిల్ ర్యాలీ

చిగురుమామిడి/జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు మద్దతుగా శుక్రవారం చిగురుమామిడి, జమ్మికుంటలో మండల బీసీ సంఘాల ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చిగురుమామిడిలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, జమ్మికుంటలో సొసైటీ ఛైర్మన్ పొనగంటి సంపత్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట రవీందర్ పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు బంద్‌లో పాల్గొనాలని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్, నగర అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సుభాష్‌నగర్: బీసీ బంద్ మద్దతు తెలుపుతున్నామని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ తెలిపారు.

మానకొండూర్ : బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ పిలుపునిచ్చారు.

హుజూరాబాద్: బంద్‌కు హుజూరాబాద్ కాంగ్రెస్ తరుపున మద్దతు తెలుపుతున్నామని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చిగురుమామిడి: బంద్‌ను మండలకేంద్రంలో విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య పిలుపునిచ్చారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ రామడుగు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డిని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంది తిరుపతిరెడ్డి, ఆర్‌బీవీఆర్‌ఆర్ ప్రధాన కార్యదర్శి బండగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు.

షోయబ్ ఉల్లాఖాన్ జీవితం ఓ పాఠ్యగ్రంథం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నీతి, నిజాయితీ, సత్యనిష్ఠలతో పనిచేసే పాత్రికేయులకు షోయబ్ ఉల్లాఖాన్ జీవితం ఓ పాఠ్య గ్రంథం వంటిదని సీనియర్ జర్నలిస్ట్ పీఎస్ రవీంద్ర అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సూర్య రెసిడెన్సీలో షోయబ్ ఉల్లాఖాన్ జయంతి నిర్వహించారు.

బీసీల మెయిన్ విలన్ బీజేపీ

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా బీజేపీనే మెయిన్ విలన్‌గా మారిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ బీసీల పట్ల ముందు నుంచి చిత్తశుద్ధి చాటుకుంది కాంగ్రెస్ పార్టీనే అన్నారు.